భారీ గుంతలు.. వాహనదారులకు చుక్కలు

మండలంలోని ప్రధాన రోడ్డుపై ఏర్పడిన భారీ గోతులు వాహనదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. మూడు మండలాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగించే రోడ్డుపై అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి. దీనికి తోడు భారీ వర్షాలకు వాటిల్లో నీరు చేరింది. ఫలితంగా వాహనదారులు ఈ మార్గం గుండా ప్రయాణించాలంటే నరకం చూస్తున్నారు. దీనిని బాగుచేయాలని ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.

- కొడవలూరు రైల్వేగేటు వద్ద ప్రమాదకరంగా రోడ్డు
- బెంబేలెత్తుతున్న ప్రయాణికులు


కొడవలూరు రైల్వేగేటు తూర్పు వైపు రోడ్డుపై ఇలా..


గుంతల రోడ్డుపై ప్రమాదకరంగా వాహనాలను క్రాస్ చేస్తున్న ఆర్టీసీ బస్సు

కొడవలూరు : కొడవలూరు రైల్వేగేటు వద్ద రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డు సింగిల్ రోడ్డు కావడంతో పాటు భారీగా గోతులు పడి ఉంది. రైల్వే గేటుకు ఇరువైపులా ఇదేలా ఉంది. నార్తురాజుపాళెం నుంచి రైల్వే గేటుకు వచ్చే రోడ్డు భారీగా గుంతలు పడి ఉండగా, గేటు దాటాక కొడవలూరు వెళ్లే రోడ్డు కూడా ఇదేలా గోతులు పడి ఉంది. కొడవలూరు, విడవలూరు, అల్లూరుకు వెళ్లే పెద్ద వాహనాలను టపాతోపు అండర్‌పాస్‌లో అనుమతించకపోవడంతో బస్సులు, లారీలు వంటి పెద్ద వాహనాలన్నీ కొడవలూరు రైల్వే గేటు మీదుగానే వెళ్తున్నాయి. గేటు వేసినప్పుడు ఇవతలి వైపు, అవతలి వైపు పెద్ద వాహనాలు బారులు తీరి నిలిచి పోతున్నాయి. గేటు ఎత్తిన తరువాత కూడా రెండు వైపులా సింగిల్ రోడ్డు కావడం, రోడ్డుపై భారీగా గోతులు పడి ఉండడంతో వాహనాలు ఒకదానికొకటి క్రాస్ చేసే క్రమంలో పడిపోయేలా ఉన్నాయి. గుంతలను తప్పించుకొని వాహనాన్ని క్రాస్ చేయడం కుదరక గుంతలోకి దిగి ఓ వైపునకు బాగా వాలిపోతున్నాయి. ఈ సమయంలో బస్సుల్లోని ప్రయాణికులైతే బెంబేలెత్తిపోతున్నారు. ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బస్సులు, ఆటోల్లో ప్రయాణించాల్సి వస్తోందని వాపోతున్నారు. రోడ్డు ఇలాగే ఉంటే పెను ప్రమాదం తప్పదని ఆందోళన చెందుతున్నారు. ఈ రోడ్డుకున్న ఆవశ్యకతను దృష్టిలో పెట్టుకుని ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వెంటనే రోడ్డు మరమ్మతులు చేపట్టి ప్రమాదాలు జరగకుండా చూడాల్సిన అవసరం ఉంది.


దుస్థితిలో ఉన్న రోడ్డు


రైల్వే గేట్ పడమటి వైపు రోడ్డుపై ప్రమాదభరితంగా లోతైన గుంత

ప్రాణాంతకమే..



కొడవలూరు రైల్వే గేటు వద్ద రోడ్డు అత్యంత ప్రమాదకరంగా ఉంది. మండలంలోని వివిధ గ్రామాలతో పాటు అల్లూరు, విడవలూరు మండలాల వారు నిత్యం నార్తురాజుపాళెం వస్తుంటారు. అందువల్ల ఈ రోడ్డు ఎంతో రద్దీగా ఉంటోంది. ఇంతటి ప్రాధాన్యమున్న రోడ్డు దుర్భరంగా ఉన్నా పట్టించుకునే వారు లేకుండాపోయారు. అనారోగ్యంతో ఉన్న వారు, గర్భిణులు ఈ రోడ్డుపై ఆటోలో, లేక బస్సులో ప్రయాణించాలంటే ప్రాణాంతకంగా మారింది. ఆటోలు, బస్సులలో వెళ్లేటప్పుడు గోతుల్లో పడి పడిపోయేలా ఉన్నాయి. ఇలాంటి ప్రమాదం జరిగితే ప్రాణనష్టం జరుగుతుంది. ఇలాంటి ఘటనలు జరగకుండా ముందే ప్రజాప్రతినిధులైనా స్పందించి రోడ్డు పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలి.

– దేగా మురళీమోహన్‌రావు, గుండాలమ్మపాళెం, కొడవలూరు మండలం

కీలకమైన రోడ్లపై నిర్లక్ష్యం తగదు



కొడవలూరు రైల్వేగేటు రోడ్డు ఎంతో కీలకమైంది. దీనివల్ల ఇక్కడ ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలని ప్రతిపాదించి ఉన్నారు. ఎన్నో ఏళ్లుగా ప్రతిపాదనతో సరిపుచ్చుతున్నారు. ఇది సింగిల్ రోడ్డు కావడం, భారీ గోతులు పడి ఉండడంతో ప్రయాణికులకు ప్రాణసంకటంగా మారింది. ఫ్లైఓవర్ నిర్మాణం ఇప్పట్లో జరిగేలా లేనందున కనీసం రోడ్డును పూర్తిస్థాయి మరమ్మతులు చేయాలి. లేనిపక్షంలో పెను ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మేల్కోవాల్సిన అవసరం ఉంది. ప్రమాదం జరిగి ప్రాణనష్టం జరిగాక మేల్కొనే కంటే ముందుగా మేల్కొని రోడ్డు మరమ్మతులు చేస్తే ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చు.

– కలిశెట్టి వెంకయ్య, తలమంచి, కొడవలూరు మండలం

క్లుప్తంగా

ఎక్స్‌రే ప్లాంట్‌లో టెక్నీషియన్ లేక ఇబ్బందులు


వేచి ఉన్న రోగులు

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెం హెల్త్ సెంటర్‌లో నెలకొల్పిన ఎక్స్‌రే ప్లాంట్‌కు టెక్నీషియన్ లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం వెలుగు చూసింది. డాక్టర్లు ఎక్స్‌రే తీయించుకోమని స్లిప్‌లు అయితే రాస్తున్నారు గానీ, ఎక్స్‌రే తీసే గదికి వెళ్తే పనిచేత కాని వ్యక్తి అక్కడ కూర్చొని ఏదో సాకులు చెబుతున్నాడని పేషెంట్లు సోమవారం ఆస్పత్రికి వచ్చిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి దృష్టికి తీసుకెళ్లారు. అక్కడే ఉన్న డాక్టర్ పద్మజను ఎమ్మెల్యే ప్రశ్నించడంతో టెక్నీషియన్ ప్రస్తుతం రాలేదని, మరో వ్యక్తి ఉన్నా ఆయన ఎక్స్‌రే తీయలేరని చెప్పారు. టెక్నీషియన్ లేనప్పుడు ఎక్స్‌రే తీసుకోమని ఎలా రాస్తారంటూ వైద్యులను నిలదీశారు. సదరు ఉద్యోగి త్వరగా విధులకు హాజరు కావాల్సిందిగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట


టీపీగూడూరు: విగ్రహాల ప్రతిష్ట

మనుబోలు: మండలంలోని బద్దెవోలు గ్రామంలో కామాక్షిదేవి సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో నూతన విగ్రహాల ప్రతిష్ట, కుంభాభిషేక మహోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఇందులో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

- **తోటపల్లిగూడూరు:** మండలంలోని కొత్తపాళెం గ్రామంలో ఉన్న చెన్నకేశవ స్వామి ఆలయంలో భూదేవి, శ్రీదేవి విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమం సోమవారం వేడుకగా సాగింది. దాతల సహాయంతో ఇటీవల స్థానికులు విగ్రహాలను సిద్ధం చేశారు. 19వ తేదీ నుంచి విగ్రహాల ప్రతిష్ట మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు.


రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

- నడిరోడ్డుపై లారీ నిలపడమే కారణం


ప్రమాదంలో గాయపడిన రాజేష్

వెంకటాచలం: లారీ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన మండలంలోని తాటిపర్తిపాళెం సమీపంలో కృష్ణపట్నం పోర్టు రోడ్డుపై ఆదివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. తిక్కవరప్పాడు గ్రామానికి చెందిన చింతల రాజేష్ ముత్తుకూరు మండలం పంటపాళెం సమీపంలోని అనా పామాయిల్ ఫ్యాక్టరీలో పని చేస్తు న్నాడు. ఆదివారం రాత్రి పని ముగించుకుని తన మోటార్ బైక్‌పై బయలుదేరాడు. తాటిపర్తిపాళెం సమీపంలో కృష్ణపట్నం పోర్టు నడిరోడ్డుపై లారీని డ్రైవర్ నిలిపివేసి వెళ్లాడు. ఆ మార్గంలో వస్తున్న రాజేష్‌కు చీకట్లో లారీ ఉన్న విషయం తెలియక ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అతను తీవ్ర గాయాలవడంతో స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. డ్రైవర్లు వాహనాలను నిర్లక్ష్యంగా ఎక్కడపడితే అక్కడ నిలపకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ట్యాంకర్ బోల్తా



మర్రిపాడు: మండలంలోని కదిరినాయుడుపల్లి సమీపంలోని కేతామన్నేరువాగు బ్రిడ్జి వద్ద ఓ ట్యాంకర్ సోమవారం బోల్తా పడింది. నెల్లూరు నుంచి కడపకు వెళ్తున్న ట్యాంకర్ డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో అదుపుతప్పి బ్రిడ్జిపై నుంచి 50 అడుగుల లోతులో ఉన్న సర్వీస్ రోడ్డుపై బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

సర్వసభ్య సమావేశం రేపు


మాట్లాడుతున్న ఎంపీపీ జ్యోతి

కొడవలూరు : స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని ఎంపీపీ గాలి జ్యోతి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ ఎంపీపీ చాంబర్‌లో స్థానిక సంస్థల ప్రతినిధులతో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సర్వసభ్య సమావేశం అనంతరం బదిలీపై వెళ్లిన అధికారులకు సన్మానం జరుగుతుందని తెలిపారు. అనంతరం బదిలీపై మండలానికి వచ్చిన అధికారులతో పరిచయ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సర్పంచ్‌లు బి.సుప్రియ, మారంరెడ్డి రంగారెడ్డి, మోర్ల రమేష్, వల్లాపురం నవీన్, కామాక్షి, ఎంపీటీసీ సభ్యులు కామేశ్వరి, ప్రతాప్ పాల్గొన్నారు.

మత్స్యకారుల అప్రమత్తం


కృష్ణపట్నం పట్టపుపాళెం వద్ద పడవలు

ముత్తుకూరు: బంగాళాఖాతంలో గత వారం ఏర్పడిన అల్పపీడనం కారణంగా వేట మానేసిన మత్స్యకారులను తాజాగా మరో తుఫాన్ హెచ్చరిక ఆందోళనకు గురిచేస్తోంది. తూర్పు మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుఫాన్‌గా మారే అవకాశం ఉన్నట్టు వార్తలు వెలువడడంతో నేలటూరు, కృష్ణపట్నం ప్రాంతాల గంగపుత్రులు అప్రమత్తమయ్యారు. దీని తర్వాత ఒకేసారి వేటకు వెళ్లొచ్చనే అభిప్రాయానికి వచ్చారు. జిల్లాపై తుఫాన్ పెద్దగా ప్రభావం ఉండదని భావిస్తున్నా సముద్రంలోకి వెళ్లొద్దంటూ అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

కాకాణిని కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు


మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో నాయకులు

పొదలకూరు: వైఎస్సార్‌సీపీ ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని మండలంలోని దుగ్గుంట పంచాయతీ పార్టీ నాయకులు, కార్యకర్తలు సోమవారం నెల్లూరులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో దుగ్గుంట ఎంపీటీసీ సభ్యుడు కేతు రామిరెడ్డి పాల్గొన్నారు.

బడికి దూరంగా..


భిక్షాటన చేస్తున్న బాలుడు

బడికెళ్లి చదువుకోవాల్సిన వయసులో కొందరు పిల్లలు భిక్షాటన చేస్తున్నారు. పొదలకూరు పట్టణానికి తరచూ కొందరు బాలలు వచ్చి వ్యాపారస్తుల వద్ద భిక్షాటన చేస్తున్నారు. వీరిని వారి తల్లిదండ్రులు పంపుతున్నారా? లేక ఏదైనా ముఠా బలవంతంగా ఇలా చేయిస్తుందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

– పొదలకూరు

వన్నె తగ్గని నిమ్మ


యార్డుకు వచ్చిన నిమ్మకాయలు

- పెరుగుతున్న దిగుబడి
- అన్ని రాష్ట్రాలకు ఎగుమతులు

పొదలకూరు: దసరా నవరాత్రులు పూర్తయిన తర్వాత నిమ్మకాయల ధరలు తగ్గిపోతాయని రైతులు భావించారు. అంతేకాక తోటల్లో దిగుబడి కూడా లేకుండా పోతుందనుకున్నారు. అయితే దిగుబడితోపాటు ధరలు కూడా నిలకడగానే ఉన్నాయి. ప్రస్తుతం మార్కెట్లో కిలో రూ.40 నుంచి రూ.70 వరకు ఉంది. ఈ ధరలు రైతులకు అనుకూలంగానే ఉన్నాయి. బస్తాల్లో పరిశీలిస్తే లూజు (బస్తా) ఒక్కటింటికి అత్యధికంగా ధర రూ.5,600 కాగా అత్యల్పంగా రూ.3,200 పలుకుతున్నట్టు వ్యాపారులు తెలిపారు. గతేడాది ఇదే సీజన్లో కిలో నిమ్మకాయలు రూ.20 నుంచి రూ.40 మాత్రమే పలికాయి. ధరలు ఎప్పుడు పెరుగుతాయో, ఎప్పుడు తగ్గుతాయో చెప్పలేని పరిస్థితుల్లో ఉన్నారు. వినియోగంతోపాటు చలి, వర్షాలు తదితర కారణాలతో ధరలు పెరగడం, తగ్గడం జరుగుతుంది. తోటల్లో కాయల దిగుబడి కూడా బాగా పెరిగింది. పొదలకూరు నిమ్మ మార్కెట్ యార్డుకు దసరా తర్వాత కాయలు బాగా వస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో ఇప్పటికీ పలువురు రైతులు ప్రతినిత్యం 20 బస్తాల కాయలు కోసి మార్కెట్‌కు పంపుతున్నారు. ఇప్పుడున్న ధరల ప్రకారం వారికి ప్రతినిత్యం రూ.50 వేల నుంచి రూ.60 వేలు అందుతున్నట్టు తెలుస్తోంది. కాయలు లేని రైతులు తోటలకు పెట్టుబడులు పెడుతూ నష్టపోతున్నారు.

అన్ని రాష్ట్రాలకు..

కొన్ని సీజన్లలో వ్యాపారులు డిమాండ్ ఉన్న రాష్ట్రాలకే కాయలను ఎగుమతి చేస్తుంటారు. అయితే ప్రస్తుతం దక్షిణ, ఉత్తర భారతదేశాల్లో అన్ని రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. ఇందుకు సరిపడా కాయలు కూడా మార్కెట్‌కు వస్తున్నట్టు తెలిపారు. సాధారణంగా ఇలాంటి సీజన్లలో తమిళనాడు, కేరళ, కర్ణాటకలకు మాత్రమే ఎగుమతులు ఉండేవి. ఉత్తర భారతదేశంలో చలితీవ్రత మొదలవుతున్న నేపథ్యంలో ఎగుమతి తగ్గుతుంది. అయితే ఇప్పుడు ఢిల్లీ మార్కెట్‌తోపాటు లక్నో, పాట్నా, వారణాసి, మధుర తదితర ప్రాంతాలకు కూడా పంపిస్తున్నారు.

టీడీపీ నేత భూ ఆక్రమణలపై ఆందోళన


ఆందోళన చేస్తున్న జట్ల కొండూరు వాసులు

- చర్యలు తీసుకోవాలని జట్ల కొండూరు వాసుల డిమాండ్

మనుబోలు: తమ గ్రామంలో ప్రభుత్వ భూములు ఆక్రమించుకుని అనుభవిస్తున్న టీడీపీ నాయకుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మండలంలోని జట్ల కొండూరు గ్రామస్తులు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా గ్రామ ఉప సర్పంచ్ ఆవుల తులసీరామ్ మాట్లాడుతూ జట్ల కొండూరు పంచాయతీ పరిధిలోని కొండూరు సత్రం, శ్మశానం, చెరువు, హరిజనవాడ, అరుంధతీవాడ రోడ్లు, కుడితిపల్లి మెయిన్ రోడ్డు భూములను తమ గ్రామానికే చెందిన టీడీపీ నాయకుడు వెందోటి భాస్కర్‌రెడ్డి ఆక్రమించుకున్నాడని ఆరోపించారు. చెరువు భూమిని తండ్రి వెందోటి రంగారెడ్డి తనకు రాసిచ్చినట్లుగా భాస్కర్‌రెడ్డి తప్పుడు పత్రాలు సృష్టించి దానిని వేరే వ్యక్తికి విక్రయించాడన్నారు. అలాగే రోడ్డు భూములను తన కుటుంబసభ్యుల పేరుపై నమోదు చేసుకుని గ్రామస్తులకు దారి లేకుండా చేశాడన్నారు. భూములకు సంబంధించిన పత్రాలను గూడూరులోని సిండికెట్ బ్యాంక్‌లో తాకట్టు పెట్టి రుణాలు కూడా పొందాడని ఆరోపించారు. విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డీటీ బషీర్‌కు వినతిపత్రం అందజేశారు. పోలీస్‌స్టేషన్‌లో కూడా చీటింగ్ కేసు పెట్టినట్లు తెలిపారు. ఈ ఆక్రమణలపై భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ తాను ఎక్కడా ప్రభుత్వ, ఇతరుల భూములను ఆక్రమించలేదన్నారు.

సద్వినియోగం చేసుకోండి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం : ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం హెల్త్ సెంటర్ ఆవరణలో వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేసే పింక్ బస్సును ఆమె సోమవారం ప్రారంభించి, మాట్లాడారు. కేన్సర్‌ను తొలిదశలో గుర్తిస్తే నివారించవచ్చన్నారు. ఇప్పటికే ఇందుకూరుపేటలో జరిగిన కార్యక్రమంలో 600 మందికి పరీక్షలు చేయగా 97 మందికి లక్షణాలు కనిపించాయని, కొడవలూరులో 1,017 మందిలో 150 మందికి, కోవూరులో 1,200 మందిలో 127 మందికి కేన్సర్ లక్షణాలు ఉన్నట్లు తేలిందన్నారు. కార్యక్రమంలో వైద్యులు మనోజ్, పద్మజ, చైర్‌పర్సన్ సుప్రజ, కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ శ్రీహరి పాల్గొన్నారు.

ఏడీఎంహెచ్ఓ తనిఖీలు

సంగం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా టీబీ, లెప్రసీ అధికారి, ఏడీఎంహెచ్ఓ ఖాదర్‌వలీ సోమవారం తనిఖీ చేశారు. అనంతరం రాళ్లచెలిక ప్రాంతంలో అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్‌ను పరిశీలించి ఏఎన్ఎంలకు సూచనలు చేశారు. షుగర్ వ్యాధిగ్రస్తులకు వ్యాక్సిన్‌పై అవగాహన కల్పించి తప్పక వేసుకునేలా చూడాలన్నారు. వారం కంటే ఎక్కువ రోజులు దగ్గు, జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించి గళ్ల పరీక్ష కోసం ల్యాబ్‌కు పంపాలని సూచించారు. ఆయన వెంట వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, వైద్యసిబ్బంది ఉన్నారు.

అర్హత పత్రాల పరిశీలన


పత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

తోటపల్లిగూడూరు: వయో వృద్ధులు, దివ్యాంగులకు ఉపకరణాలను పంపిణీ చేసేందుకు అర్హుల ఎంపిక కార్యక్రమం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగింది. కేంద్ర ప్రభుత్వ సంస్థ ఆధ్వర్యంలో ఈ క్యాంపును నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన 70 మంది వృద్ధులు, దివ్యాంగులు తమ అర్హత పత్రాలను అధికారులకు అందజేశారు. ఎంపీడీఓ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అర్హులకు మూడు చక్రాల బండ్లు, వినికిడి యంత్రాలు, వీల్‌చైర్లు తదితరాలను అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అధికారి ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ఇన్‌చార్జి వీసీ అభినందన


క్రీడాకారులతో ఇన్‌చార్జి వీసీ

వెంకటాచలం: ఇంటర్ కాలేజియేట్ గేమ్స్ టోర్నమెంట్‌లో ప్రతిభ చూపిన విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) విద్యార్థులను ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు అభినందించారు. పురుషుల గేమ్స్ టెన్నిస్ సింగిల్స్, డబుల్స్ కేటగిరీలో పి.హేమాంజనేయులు (మెరైన్ బయాలజీ), శ్రీనివాసరావు (కెమిస్ట్రీ విభాగం) రన్నర్స్‌గా నిలిచారు. వీరిని సోమవారం వర్సిటీలో విజయభాస్కరరావు, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత తదితరులు అభినందించారు.

మద్యం షాపు వద్దంటూ ధర్నా


షాపు వద్దంటూ నిరసన వ్యక్తం చేస్తున్న జనం

ఇందుకూరుపేట: జనావాసాల మధ్య మద్యం షాపు పెట్టొద్దంటూ మండలంలోని ఇందుకూరుపేటలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఇందుకూరుపేటలోని ప్రధాన రహదారి పక్కనే సెంటర్‌లో కొత్తగా షాపు పెట్టేందుకు ఏర్పాట్లు చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న ఆ ప్రాంతవాసులు నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఇక్కడ మద్యం షాపు ఉంటే మహిళలు, పిల్లలు తీవ్ర ఎదుర్కోవాల్సి వస్తుందని వాపోయారు. అనంతరం రోడ్డుపై రాస్తోరోకో నిర్వహించారు. తొలుత వారు దుకాణం ఏర్పాటు చేయొద్దంటూ తహసీల్దార్‌కు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం అందజేశారు.